వీడీసీలపై కలెక్టరేట్ ఏవోకు ఫిర్యాదు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి కమిటీల మూలాలను పీకి వేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల జిల్లాలో తరచూ వీడీసీల ఆగడాలు పెరిగిపోతున్నాయని ఈ విషయంలో జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, నాయకులు పాల్గొన్నారు.


• మట్టిని తరలిస్తున్న వాహనాలు

ఎస్సారెస్పీలో జోరుగా మట్టి తవ్వకాలు

- శ్రీరాంసాగర్ నుంచి కొనసాగుతున్న నల్లమట్టి దందా
- నేతల అండదండలతో రింగ్‌గా ఏర్పడి సరఫరా
- పంచగుడి కేంద్రంగా ఎస్సారెస్పీలో నల్లమట్టి తవ్వకాలు
- నేతల ఒత్తిళ్లతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



నిజామాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సారెస్పీ నుంచి నల్లమట్టి దందా కొనసాగుతోంది. ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారు. రైతుల వద్ద వేల రూపాయలను వసూలు చేస్తూ నిత్యం సరఫరా చేస్తున్నారు. ప్రతియేడు ఎస్సారెస్పీ నుంచి లారీలు, టిప్పర్ల ద్వారా ఈ మట్టిని తరలిస్తున్నారు. పసుపు, ఇతర పంటలు పండించే భూముల్లో మట్టిని వేస్తారు. దిగుబడితో పాటు పంటలు బాగా రావడం భూములు కూడా బాగుండటంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎక్కువ మొత్తంలో డబ్బులు ఖర్చు అయినా పశువుల ఎరువులు లేకపోవడం వల్ల ఈ నల్లమట్టినే పోస్తున్నారు. అయితే కొన్నేళ్లుగా కొంత మంది రింగ్‌గా మారి మట్టిని తరలిస్తుండటంతో రైతులకు ఆర్థిక భారం పెరుగుతోంది.

ఎస్సారెస్పీ నల్లమట్టికి డిమాండ్ ఎక్కువ

పంట చేనుల్లో నల్ల మట్టిని వేస్తే దిగుబడి పెరుగుతోంది. వరదల ద్వారా వచ్చి చేరే ఈ మట్టి వల్ల భూమి కూడా బలం పెరుగుతోంది. సేంద్రియ ఎరువులు వేసిన విధంగానే ఈ మట్టి వేయడం వల్ల పంట బాగా వస్తుంది. ఆరుతడి పంటలు ముఖ్యంగా పసుపు సాగు చేసే రైతులు ఈ మట్టిని గత మూడు దశాబ్దాలుగా ఎక్కువగా వినియోగిస్తున్నారు. పశువుల పేడ, గొర్రెల ఎరువు లేకపోవడం వల్ల ఎక్కువగా ఈ నల్లమట్టిపైనే ఆధారపడుతున్నారు. ఈ మట్టి కోసం ఎకరాకు సరాసరి రూ.50వేల నుంచి రూ.60వేల వరకు రైతులు ఖర్చు చేస్తున్నారు. దూరాన్ని బట్టి కొంత మంది రైతులకు రూ.30వేలలోపే అవుతుండగా దూరం ఎక్కువగా ఉన్న వారికి రూ.60వేలకు పైగా ఖర్చు అవుతుంది. ప్రతీ సంవత్సరం ఈ మట్టిని వేసుకున్న పంట పొలాల్లో తెగుళ్లను తట్టుకోవడంతో పాటు దిగుబడి పెరుగుతుండటంతో ఆర్మూర్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల రైతులు ముఖ్యంగా పసుపు, కూరగాయలు, మొక్కజొన్న సాగు చేసే రైతులు ఎక్కువగా వేస్తున్నారు. ఏప్రిల్ నెలల్లోనే మట్టి వేసి మే నెలలో పంట చేనులకు దుక్కులను సిద్ధం చేస్తారు. జూన్ ఆరంభంలోనే పసుపు సాగును మొదలు పెడతారు. పసుపుతో పాటు మొక్కజొన్న, సోయా పంటలను వేస్తారు.

రింగ్‌గా ఏర్పడి మట్టి తరలింపు

రైతులకు ఉన్న డిమాండ్‌ను బట్టి నల్లమట్టిని కొన్నేళ్లుగా కొంత మంది వ్యక్తులు రింగ్‌గా ఏర్పడి మట్టిని తరలిస్తున్నారు. ఎస్సారెస్పీలో పూడిక ఎక్కువగా చేరడంతో అధికారులు కూడా నల్లమట్టిని తవ్వుకునేందుకు అనుమతులను ఇస్తున్నారు. దీనిని సాకుగా చేసుకొని కొంత మంది ప్రజాప్రతినిధుల అనుచరులు, బంధువులు పెద్ద ఎత్తున ఈ నల్లమట్టిని సరఫరా చేస్తున్నారు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పంచగుడి కేంద్రంగా చేసుకొని గత కొన్ని రోజులుగా ఈ నల్లమట్టి తవ్వకాలను చేస్తున్నారు. పెద్ద ఎత్తున ప్రతీరోజు తరలిస్తున్నారు. భారీ సంఖ్యలో వాహనాలను వినియోగిస్తూ రాత్రి, పగలు లేకుండా తరలింపు కొనసాగిస్తున్నారు. జేసీబీలను పెట్టి టిప్పర్ల ద్వారా మట్టి తరలింపులను కొనసాగిస్తున్నారు. నల్లమట్టి డిమాండ్‌ను బట్టి దగ్గరగా ఉన్న గ్రామాలకు రూ.3వేల నుంచి రూ.3500లు తీసుకుంటుడగా దూరం ఎక్కువగా ఉన్న గ్రామాలకు రూ.6500ల నుంచి ఆ పైన దూరాన్ని బట్టి వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడం పంట చేనులు కూడా అయిపోవడంతో ఎక్కువ మంది రైతులు ఈ మట్టిని కొనుగోలు చేస్తున్నారు. ఎస్సారెస్పీ అధికారులు ఆయా గ్రామాల పరిధిలో మట్టి తవ్వుకునేందుకు ప్రతీ సంవత్సరం ఈ అనుమతులను ఇస్తున్నారు. పూడిక ఎక్కువగా చేరడం వల్ల తప్పిన ఇబ్బందులు లేకపోవడంతో అనుమతులను మంజూరు చేస్తున్నారు. దీనిని ఆదాయ వనరులుగా భావిస్తున్న కొంత మంది పెద్ద ఎత్తున తవ్వకాలు చేస్తూ టిప్పర్లు, లారీల ద్వారా తరలిస్తున్నారు. ఈ నల్లమట్టిని ఎక్కువ మొత్తంలో టిప్పర్లు, లారీల్లో నింపడం వల్ల కెపాసిటీకి మించి మట్టి వేయడంతో ప్రమాదాలకు కూడా కారణం అవుతున్నాయి. అధిక లోడ్ వల్ల అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ మట్టి తరలింపుపై అధికారులపై కూడా ఒత్తిళ్లు బాగా పెరిగాయి. చూసి చూడనట్లు వ్యవహరించాలని నేతలు చెప్పడంతో వారు కూడా పట్టించుకోవడం లేదు. ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే కొన్ని వాహనాలను సీజ్ చేస్తున్నారు. ఫైన్‌లను వేస్తున్నారు. ఎస్సారెస్పీ నుంచి రైతులకు అనుమతులు ఇచ్చి తవ్వుకునే విధంగా అవకాశాలు ఇస్తే వారిపైనే భారం తక్కువగా పడనుంది. ప్రభుత్వం కూడా ఎస్సారెస్పీలో పూడికను తీసేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ప్రాథమికంగా నివేదికలను కూడా అధికారులు తయారు చేశారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులలో పరిశీలించిన మీదట ఈ ప్రాజెక్టులో కూడా తీసేందుకు సిద్ధమవుతున్నారు. ఎస్సారెస్పీ అధికారులు ప్రణాళిక బద్ధంగా మట్టి తవ్వకాలను చేసి రైతులకు సరఫరా చేస్తే మేలు జరగనుంది. ప్రాజెక్టులో పూడిక తగ్గడంతో పాటు ఎస్సారెస్పీకి కూడా ఆదాయం రానుంది. నల్లమట్టి తవ్వకాలపై అధికారులు మాత్రం స్పందించడం లేదు. తాము ఏమి మాట్లాడలేమని రైతులకు మేలు జరుగుతుందని పట్టించుకోవడం లేదని వారు తెలిపారు.

నిద్రావస్థలో తూనికల శాఖ

యథేచ్ఛగా తూకంలో తేడా..
చర్యలు తీసుకోని అధికారులు

7

ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేయాలి

- అర్హులందరికీ అందే విధంగా చూడాలి
- సన్నబియ్యం పంపిణీపై నజర్ పెట్టాలి
- ఏ గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాలి
- ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి
- జిల్లా అధికారులతో సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి, చిత్రంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్ తదితరులు

నిజామాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'జిల్లాలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను పక్కాగా అమలు చేయాలి. ప్రజలకు మెరుగైన పాలన అందించాలి. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి. సన్నబియ్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా ఉండాలి' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రభుత్వ పథకాల అమలు, తాగునీటి సరఫరా, సన్నబియ్యం పంపిణీ, ధాన్యం కొనుగోలుపై ఆయన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డితో కలిసి సమీక్షించారు. ఇందిరమ్మ ప్రజాపాలనలో అన్ని వర్గాల ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా సమర్థవంత సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ షాపు డీలర్లను భర్తీ చేయాలన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ పూర్తి స్థాయిలో జరగాలన్నారు. జిల్లాలో ఈ యాసంగిలో 11లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్నారు. దీనిలో 8లక్షల మెట్రిక్ టన్నులను సేకరించే విధంగా చూడాలన్నారు. తూకంలో మోసం లేకుండా చూడటంతో పాటు రైతులకు ఇబ్బందులు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్‌తో కూడిన కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వాటర్ గ్రిడ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కోక్క వ్యక్తికి ప్రతీరోజు కనీసం 100 లీటర్లు, పట్టణ ప్రాంతంలో 150 లీటర్ల చొప్పున నీటిసరఫరా జరపాలన్నారు. ఆర్మూర్ పట్టణానికి అమృత్ పథకం కింద 43 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని అన్నారు. ఈ మున్సిపాలిటీలో ఈ నిధులతో తాగునీటిని మెరుగుపరిచే విధంగా పనులు చేప ట్టాలన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని మంత్రి ఆదేశించారు.

అర్హులను ఎంపిక చేయాలి..

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. పేదలకు మాత్రమే ఈ పథకం వర్తింప జేసే విధంగా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణం కనిష్ఠంగా 400 స్క్వేర్ ఫీట్లు, గరిష్ఠంగా 600 స్క్వేర్ ఫీట్లు ఉండే విధంగా చూడాలన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయించారని అన్నారు. భూ భారతి ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో తహసీల్దార్లు, మండల స్థాయిలో అదనపు కలెక్టర్లు, కలెక్టర్ పాల్గొని అవగాహన కల్పించాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలిస్తూ 15 రోజుల్లోనే మంజూరు చేసే విధంగా చూడాలన్నారు. ఇందిరమ్మ ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అర్హులైన వారికి అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెబిన్ హందాన్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్మూర్, బాల్కొండ కాంగ్రెస్ పార్టీల ఇన్‌చార్జిలు వినయ్‌రెడ్డి, ముత్యాల సునీల్ కుమార్, ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్‌వో అర్వింద్ రెడ్డి, సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం

ఆర్మూర్ రూరల్: పేద ప్రజల కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని బుధవారం సన్నబియ్యం లబ్ధిదారుడు లక్కారం తవ్వన్న ఇంట్లో ఉమ్మడి కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. పభుత్వంపై భారం పడుతున్న పేద, ప్రజల కోసం సన్నబియ్యం పంపిణీ చేస్తు న్నామన్నారు. అంతకుముందు మంత్రి ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువు సమీపంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శిలాఫలకం వేశారు. అనంతరం పట్టణంలోని క్షత్రియ కల్యాణమండపంలో మంత్రి జూపల్లి కృష్ణారావు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆర్మూర్ నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణానికి రూ. 170 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.


మామిడిపల్లిలో సన్నబియ్యం భోజనం చేస్తున్న మంత్రి జూపల్లి


ఎత్తొండ సహకార సంఘం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ఆగ్రహం

• ఎత్తొండ సహకార సంఘానికి తాళం వేసి రైతుల నిరసన

కోటగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి 20రోజులు కావస్తున్నా.. సరిపడా గన్నీ బ్యాగులు ఏర్పాటు చేయక పోవడంతో పాటు సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఎత్తొండ సహకార సంఘానికి రైతులు బుధవారం తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఎత్తొండ సహకార సంఘంలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. హమాలీలు, గన్నీ బ్యాగుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గన్నీబ్యాగులు సైతం పెద్ద రైతులకు అందిస్తూ చిన్న రైతుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్యాలయానికి వచ్చి గన్నీ బ్యాగులు కావాలని అడిగితే పట్టించుకునే వారే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ పరిస్థితులు తమను కరవర పెడుతుంటే.. అధికారులు పట్టించుకోకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆ తర్వాత సహకార సంఘం సిబ్బందిని బయటకు పంపి గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గంగాధర్ సహకార సంఘానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. హమాలీల కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని, గన్నీ బ్యాగుల కొరతను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తూకం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన రైస్‌మిల్లర్లు తరలించి ఆన్‌లోడింగ్ చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

జాతీయ పోషణ పక్షం ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏడో జాతీయ పోషణ పక్షం 2025 కార్యక్రమం బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 22 వరకు పోషణ పక్షం కార్యక్రమం కింద చేపట్టవల్సిన కార్యక్రమాల గురించి షెడ్యూల్‌ను విడుదల చేశారు. వెయ్యి రోజుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి రసూల్‌బీ, డీఆర్‌డీవో సాయాటగౌడ్ పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేసిన అదనపు కలెక్టర్ అంకిత్

మంత్రి, ఎమ్మెల్యే మధ్య మాటల యుద్ధం



- తులం బంగారం ఎప్పుడిస్తారని ప్రశ్నించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- కేసీఆర్ ఏ సీఎం చేయని అప్పులు చేశాడన్న మంత్రి జూపల్లి
- మంత్రి వెళ్లాక కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఘర్షణ
- పోలీసుల లాఠీచార్జ్
- ఖాకీల తీరుపై ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం


పోలీసుల తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ముందుగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం కూడా ఆడబిడ్డలకు ఇవ్వాలన్నారు. ఇంకెప్పుడు తులం బంగారం ఇస్తారన్నారు. ఆ తర్వాత మాట్లాడిన మంత్రి జూపల్లి.. ఎమ్మెల్యే చెప్పిన ప్రకారం తులం బంగారం కూడా అందజేస్తామన్నారు. కేసీఆర్ 10ఏళ్ల హయాంలో గతంలో ఏ ముఖ్యమంత్రులు చేయని విధంగా అప్పులు చేశాడన్నారు. కేసీఆర్ చేసిన అప్పునకు ప్రస్తుతం వడ్డీకి వడ్డీ చెల్లించే పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో మధ్యలో కల్పించుకున్న ఎమ్మెల్యే.. ఆ తర్వాత మంత్రి.. ఇలా ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. అనంతరం మంత్రి బయలుదేరి వెళ్లగా.. బయట ఉన్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఘర్షణకు దిగారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలను సముదాయించే ప్రయత్నం చేయగా.. పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని బీఆర్‌ఎస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు, పోలీసులకు మధ్య మాటమాట పెరగడంతో పోలీసులు లాఠీచార్జి చేసి ఇరు వర్గాలను చెదరగొట్టి అక్కడి నుంచి పంపించి వేశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పోలీసుల తీరుకు నిరసనగా భీమ్‌గల్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. చెక్కులతో పాటు తులం బంగారం అందించాలని అడిగినందుకు అధికార దురహంకారంతో పోలీసులతో లాఠీచార్జీ చేయించారని మండిపడ్డారు. లాఠీచార్జీలో 10మంది బీఆర్‌ఎస్ నాయకులు గాయాల పాలయ్యారన్నారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సుమారు రెండు గంటల పాటు ఎమ్మెల్యే రోడ్డుపైనే బైఠాయించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేని సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది

వంటింట్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన

సుభాష్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా వంటింట్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నారాయణ టవర్స్, ప్రభాత్‌టాకీస్ చౌరస్తాలో, పలు ప్రాంతాల్లోని అపార్ట్ మెంట్‌లలో అగ్నిమాపక సిబ్బంది బుధవారం ప్రమాద నివారణపై అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ లీక్ అయితే, మంటలు చెలరేగితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని మహిళలకు వివరించారు. ప్రమాదం సంభవించినప్పుడు అరికట్టే పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నర్సింగ్ రావు, మధు, ప్రశాంత్, సురేందర్, సూరజ్, కిరణ్, ప్రశాంత్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.


• మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు కేటీఆర్ పరామర్శ



మాజీ ఎమ్మెల్యేను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

బోధన్‌రూరల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ పరామర్శించారు.బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మాజీమంత్రి కేటీఆర్ బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే షకీల్ మాతృమూర్తి మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు.మాజీఎమ్మెల్యే మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఆయన వెంటమాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులున్నారు.

కుకునూర్‌లో బడిబాట కార్యక్రమం



కుకునూర్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వేల్పూర్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ బృందం బుధవారం సంయుక్తంగా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హరిచరణ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యాభ్యాసం అందుబాటులో ఉంటుందాన్నరు. ప్రభుత్వం తమ పాఠశాలల్లో ఆధునిక సాంకేతిక సదుపాయం కల్పించిందన్నారు. ప్లాట్ ప్యానెల్స్ ఉపయోగించి ఉపాధ్యాయులు చక్కటి విద్యబోధనను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హరిచరణ్, ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంహరిప్రసాద్,ఉపాధ్యాయులు గంగాధర్, రవీందర్, శ్రీధర్‌రావు, నరేందర్, నాగేంద్ర, సురేష్, తదితరులున్నారు.

కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన అన్వేష్‌రెడ్డి



కరీంనగర్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

వేల్పూర్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ ప్రమేలా సత్పతిని రాష్ట్ర విత్తనాభివృద్ధి చైర్మన్ అన్వేష్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఈవానకాలం సీజన్‌కి జిల్లాలో కావాల్సిన విత్తనాలు టీజీసీడ్ ద్వారా విత్తన లభ్యత, విత్తన సరఫరా వంటి అంశాలపై కలెక్టర్‌తో అన్వేష్ రెడ్డి సూచించారు. మెడికల్ కాలేజీ ఏర్పాటు నిమిత్తం విత్తనాభివృద్ధి సంస్థ గోదాములను కేటాయించిన అనంతరం సంస్థకు విత్తనోత్పత్తి, విత్తనశుద్ధి,నిల్వ ప్రక్రియలనిర్వహణకు తగిన వసతులు అందుబాటులో లేవన్న విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. విత్తన సరఫరా, విత్తనోత్పత్తి రైతుల నుండి సేకరించిన విత్తనాలను ప్రాసెసింగ్ చేసి భద్రపర్చడానికి తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించి సంబంధిత సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు అన్వేష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అనంతరం అన్వేష్‌రెడ్డి విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో రైతులకు అన్ని రకాల నాణ్యమైన విత్తనాలను సమృద్ధిగా అందుబాటులో ఉండేలా, సమయానికి అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.

వేతనాలు చెల్లించాలని ఎంపీడీవోకు వినతి

మెండోర,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి):మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయ మైన సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు మెట్టు శేఖర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ఎంపీడీవోలకు ఫీల్డ్ అసిస్టెంట్లు తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెల లుగా పెండింగ్ లో ఉన్న తమ వేతనాలు చెల్లించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ వర్తింప చేస్తు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామి ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు గంగారాం, పద్మరాజ్, తిరుపతి, ముత్యం, బాబు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: గత మూడు నెలల నుండి జీతాలు లేక కుటుంబ పోషణ భారం అవుతుందని త్వరితగతిన జీతాలను చెల్లించి ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదుకోవాలని బుధవారం రెంజల్ మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రఫీకి ఫీల్డ్ అసిస్టెంట్లు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు మధు, శోభన్, రమేష్, అర్షద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి,: మహాత్మగాంధీ ఉపాదిహమీపథకంలో విదులు నిర్వర్తిస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్‌ల సమస్యలను తక్షనం పరిష్కరించాలని కోరుతు రాష్ట్ర కమిటి పిలుపుమెరకు బుధవారం కమ్మర్‌పల్లి లో ఎంపీడీవోకు వినతి పత్రాన్ని సమర్పించుకున్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో మండల ఫీల్డఅసిస్టెంట్‌ల అధ్యక్షుడు ఫేక్ సాదుల్ల, ఉపాద్యక్షుడు దేవి హరీష్, కార్యదర్శి సాదుల రాజేశ్వర్, సభ్యులు ద్యావతి అశ్వపతి, జంగిటి గోపాల్, కానూరు లస్మన్న, పసుపుల రాము, యాట నవీన్, మేకల రాకేష్‌లు ఉన్నారు.

ఫకీరాబాద్ శివారులో వ్యక్తి ఎముకలు, పుర్రె లభ్యం

● అదృశ్యమైన వ్యక్తికి చెందినవిగా గుర్తింపు

నవీపేట,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌కు చెందిన నీరడి శ్రీనివాస్(26) అనే వ్యక్తికి చెందిన ఎముకలు, పుర్రె బుధవారం లభ్యమయ్యాయని ఎస్ఐ వినయ్ తెలిపారు. శ్రీనివాస్ గతంలో మేస్త్రి పని చేసే వాడని ప్రస్తుతం గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద అతడు పశువుల కాపరిగా పని చేస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. గత నెల 18న పశువులకు గడ్డి కోసుకురావడానికి యాజమానికి చెందిన బైక్‌ను తీసుకుని వెళ్లాడని ఆయన పేర్కొన్నారు. నాలుగు రోజుల తర్వాత స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద బైక్ లభ్యం కాగా శ్రీనివాస్ ఆచూకీ లభించలేదని అన్నారు. కుటుంబ సభ్యులు అతని కోసం గాలించినప్పటికీ ఫలితం కనిపించలేదని అన్నారు. బుధవారం స్థానిక కాశీరెడ్డి చెరువు సమీపంలోని వాగు వద్ద వ్యక్తికి చెందిన ఎముకలు, పుర్రె లభ్యం కాగా సమీపంలో ఉన్న దుస్తుల ప్రకారం అవి నీరడి శ్రీనివాస్‌కు చెందినవిగా కుటుంబ సభ్యులు గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. పశువులకు గడ్డి కోసుకురావడానికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని విషపు పురుగు కాటు వేయడంతో అతడు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య శశిరేఖ, ఇద్దరు కుమారులు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ పేర్కొన్నారు.

రైతులను బ్లాక్ మెయిల్ చేస్తే సహించేది లేదు

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



దూపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

రెంజల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): రైతులను బ్లాక్ మెయిల్ చేస్తే ఎంతటి వారినైన సహించేది లేదని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. రెంజల్ మండలంలోని దూపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా 10లక్షల రూపాయలతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. 12లక్షల రూపాయలతో నిర్మించిన సోసైటీ గోదామును ప్రారంభించారు. అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేను మహిళ సంఘాల సభ్యులు, రైతులు, మహిళ సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలో ధాన్యాన్ని విక్రయించరాదని సోసైటీ వారు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో సోసైటీ చైర్మన్‌తో పాటు సీఈవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ సంఘాలను బలోపేతం చేసేందుకు మహిళ సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే సోసైటీలు తప్పుడు స మాచారం ఇచ్చి రైతులను తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి పనులను కొద్దికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. అభివృద్ధి అంటేనే గుర్తుకు వచ్చే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, సామాన్యుడి నుండి ధనికుడి వరకు ప్రతి ఒక్కరికి అక్కున చేర్చుకుని ప్రతి ఒక్కరికి సమన్వయపరుస్తూ సంక్షేమఫలాలు అందించడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు పాపాల పుట్టల పెరిగడంతో ఎంతటి కష్టమైన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి మరువలేనిదని ఆయన అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట రైతు కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు రాములు, సాయిరెడ్డి, ధనుంజయ్, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, బాబన్న, మోహన్, సురేందర్ గౌడ్, గాయసోద్దీన్, సాయిబాబా గౌడ్, జావీదోద్దీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మె శ్రీను, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కార్తీక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గైని కిరణ్, మండల ఓబీసీ అధ్యక్షుడు నితిన్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో రఫీ, సోసైటీ చైర్మన్ భూంరెడ్డి, డైరెక్టర్ నీరడి రవి, ప్రతాప్ రెడ్డి, శ్రీదేవి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి, వెంచిర్యాల్ గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో ప్రారంభించారు. రైతులు దళారులకు నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలలోనే వరిధాన్యాన్ని విక్రయించాలన్నారు. మహిళ సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ పొందాలని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ చంద రవి, బద్దం సాగర్, లక్ష్మణ్, శివ, శ్రీనివాస్, నర్సయ్య, ముత్యంరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఏర్గట్ల: రైతులుపండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తాళ్లరాంపూర్ సొసైటీ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏర్గట్ల మండలం తాళ్ళరాంపూర్‌లో కమ్మర్‌పల్లి మార్కెట్ చైర్మన్ పాలెపు నర్స య్యతో కలిసి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కమ్మర్‌పల్లిఏఎంసీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి,సొసైటి డైరెక్టర్లు దేశబోయిన సంజీవ్,గుమ్మిర్యాల లిప్టుచైర్మన్,సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మన్‌పల్లి గ్రామంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సింగిల్‌విండో చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి ప్రారంభించారు. ఏగ్రేడ్ సన్నరకం ధాన్యం క్వింటాలుకు రూ. 2300, బోనస్ రూ. 500 కలిపి క్వింటాలు సన్నరకం ధాన్యానికి రూ. 2800 లు, దొడ్డురకం క్వింటాల్ ధాన్యానికి రూ. 2300 లు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తుందని రైతులు ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాని కోరారు. ఈ కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ బైరి లక్ష్మణ్,విండోడైరెక్టర్లు,మాజీసర్పంచ్‌లు,మాజీ ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో సొసైటీ గ్రామాల రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య, తహసీల్దార్ ఎం అంజనేయులు, సొసైటి చైర్మన్ రేంగుంట దేవేందర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ కారయక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, రైతులు కొమ్ముల రాజన్నతదితర రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): అనుకోకుండా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులతో పాటు మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బందికి అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆసుపత్రులలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు రోగులను సురక్షితంగా ఎలా తరలించడానికి ప్రతి అంతస్తులో తగిన విధంగా మెట్ల నిర్మాణం చేపట్టాలని, ఏసీవిద్యుత్ ఉపకరణకు ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, నర్సులు, అగ్నిమాపక సిబ్బంది నర్సయ్య, వారిఫ్ హైమద్, వంశీకృష్ణరెడ్డి, గంగారాం పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: మండలంలోని అంకాపూర్ గ్రామంలోని రైస్‌మిల్లులు, పెట్రోల్‌బంకులో పనిచేసే కార్మికులకు అగ్నిమాపక సిబ్బంది బుధవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్ని మాపక సిబ్బంది విన్యాసాలు చేసి అనంతరం అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంఓ అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నేడు జిల్లా న్యాయాధికారికి వీడ్కోలు



సునీత కుంచాల

నిజామాబాద్‌లీగల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న జిల్లా న్యాయాధికారి సునీత కుంచాలకు జిల్లా న్యాయవాదులు నేడు వీడ్కోలు సన్మానం చేయనున్నట్లు బార్ అధ్యక్షుడు ఎం.సాయరెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల పాటు నిజామాబాద్ జిల్లాలో ఉండి పెద్దపల్లి న్యాయాధికారిగా జదిలీపై వెళ్తున్న ఆమెకు జిల్లా కోర్టులో గురువారం జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదుల అందరు సన్మా నం ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ కార్యదర్శి మాణిక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కేడీల నుంచి ప్రభుత్వ సొమ్మును స్వాధీనం చేసుకోవాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): బెల్జియంలో అరెస్టు చేసిన వజ్రాల వ్యాపారి నుండి ప్రభుత్వ సొమ్మును భారత ప్రభుత్వం స్వాధీనపర్చుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా బోధన్ డివిజన్ సహయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంజాబ్ నేషనల్ బ్యాంకుకు 14వేల కోట్ల రూపాయల కుచ్చుటోపి పెట్టిన ప్రముఖ వజ్రాల వ్యాపారి మొహుల్ చౌక్సిని బెల్జియంలో అరెస్టు చేశారని అతనిని మన దేశానికి రప్పించి లూటి చేసిన సొమ్మును స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకులకు ఏగనామం పెట్టి విదేశాలకు పారిపోయి విలాస జీవితాలు గడుపుతున్న వారినికూడా అరెస్టు చేసి వారి సొమ్మును స్వాధీనపర్చుకుంటే ఇక్కడ మన ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల శంకర్, సీతారాం, సాయిలు పాల్గొన్నారు.

చలో ఆర్మూర్‌ను విజయవంతం చేయండి

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న చేపట్టనున్న చలో ఆర్మూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాసంఘా లు, కులసంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని కుమార్ నారాయణ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమా వేశంలో జేఏసీ నాయ కులు ఆట్లాడుతూ వీడీసీల పేరుతో ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల లో కుల వృత్తు లపై దాడులను తీవ్రంగా ఖండిం చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు సావెల్ గంగాధర్, బీసీ జనసభ అధ్యక్షుడు రాజరాం యాదవ్, సీపీఐఎంఎల్ ప్రజాపంత నాయకులు వి. ప్రభాకర్, గౌడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగౌడ్, రామాగౌడ్, దేవరాం, బుస్సాపూర్ శంకర్, గంగమల్ల రాజేశ్, వెంకటేష్, ఎల్లయ్య, మహిపాల్ యాదవ్, ప్రభాకర్, జనార్ధన్ యాదవ్, శ్రీనివాస్, లింగగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో ఘనంగా శివపార్వతుల కల్యాణం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 16: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామ కాడిచెరువులో కొలువుదీరిన గంగపుత్రుల ఆరాధ్య దైవం గంగమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా నాల్గవ రోజు బుధవారం శివపార్వతులు కల్యాణం ఆలయ అర్చకులు జగదంబాదేవి ఉపాసకులు మంత్రాజ్యం కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం అమ్మవారికి మహాభిషేకం, అలంకరణ నైవేద్యహారతి మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోత్సరణల మధ్య శివపార్వతి గంగామాతల కల్యాణం నిర్వహంచారు. గంగపుత్ర సంఘ పాలక వర్గ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, శ్రీరాముల మురళి, మారయ్య, అమ్మవారికి కళశాలను సమర్పించుకున్నారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు సుంకెట నారాయణ, ఉపాధ్యక్షుడి మోతే రవీందర్ సంఘ సభ్యులు గంగమ్మ దేవి దీక్షపరులు, గంగపుత్ర సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

ఆర్మూర్ టౌన్ , ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుదవారం ప్రమాణ స్వీకరం చేసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జక్కుల శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా గట్టడి ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా జెస్సు అనిల్, కోశాధికారిగా గజ్జెల చైతన్య, సంయుక్త కార్యదర్శిగా మద్దుల గంగారాం, గ్రంథాలయ కార్యదర్శిగా శ్రావణ్‌లు ఎన్నిక కాగా ఎన్నికల అధికారులు జగన్, కొత్తపల్లి రాములు సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.ఈకార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీం సుల్తానా, జూనియర్ సివిల్ న్యాయాధికారి దీప్తివేముల,అడిషనల్‌జూనియర్ సివిల్ న్యాయాధికారి సరళరాణి పాల్గొన్నారు.

వేల్పూర్‌లో కేసీఆర్, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

వేల్పూర్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండల కేంద్రంలో బుధవారం కేసీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిల చిత్ర పటానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. వేల్పూర్ నుండి పచ్చల నడ్కుడ వరకు రూ. 5 కోట్ల 88 లక్షలతో నిర్మించిన బీటీ డబుల్‌లైన్ రోడ్డు పనులు పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీటీ రోడ్డు పూర్తయిన స్థలంలో కేసీఆర్, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

బోధన్‌రూరల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. వారి వద్ద నుండి 3100రూపాయలు, ఐదు మొబైల్ ఫోన్‌లు, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగిందన్నారు. పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పేకాట ఆడినా, నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి భూ భారతి గ్రామసభలు

లింగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలాన్ని భూ భారతి పైలెట్ మండలంగా ఎంపిక చేసిందని అందులో భాగంగా రైతుల భూ సమస్యలు పరిష్కరించేదుకు ఈనెల 17 నుంచి 30వరకు ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. మండలంలోని గ్రామ సభల వివరాలు ఇలా ఉన్నాయి.. 17న పోతాయిపల్లి, బోనాల్, 19న బాయంపల్లి, కన్నాపూర్, 21న పర్మల్ల, పొల్కంపేట, 22న ఎల్లారం, మెంగారం, 23న రాంపూర్, జల్దిపల్లి, 24న బాణాపూర్, కోర్పోల్, లింగంపల్లి, 25న భవానిపేట, ముంబాజీపేట, లింగంపేట, 26న కంచుమల్, కొండాపూర్, 28న నల్లమడుగు, నాగారం, శెట్పల్లి సంగారెడ్డి, 30న శెట్పల్లి, మోతె గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. గ్రామ సభలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలియజేశారు. ప్రతీ రోజు రెండు టీంలు తహసీల్దార్ సురేష్ టీం, నయబ్ తహసీల్దార్ చరణ్‌సింగ్ టీంలు గ్రామ సభలో పాల్గొంటాయని ఆయన తెలిపారు.

ఉప్పల్వాయిలో యువకుడి దుర్మరణం

రామారెడ్డి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పల్వాయి గ్రామానికి చెందిన కుమ్మరి సత్తయ్య (30) అనే యువకుడు వ్యవసాయం గత నాలుగు నెలల నుండి మతిస్థితం లేక చెట్టుకు ఉరేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వై. నరేష్ పేర్కొన్నారు. ఎస్సై కథనానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు మానసిక స్థితి సరిగ్గా లేక జీవితంపై విముక్తి చెంది పల్లె ప్రగతి వనంలో చెట్టుకు ఉరెసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కొడుకు ఫిర్యాదు మేరకు రామారెడ్డి ఎస్సై పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వై. నరేష్ వివరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి దుర్మరణం

రామారెడ్డి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్దికుంట గ్రామానికి చెందిన ముత్యాల చంద్రకాంత్ (23) అనే యువకుడు మృతి చెందినట్లు రామారెడ్డి ఎస్సై వైనరేష్ తెలిపారు. మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఇంట్లో పడుకొని బుధవారం ఉదయంచూడగా మృతుడు అనుమానస్పదంగా చనిపోయినట్లు గుర్తించారు. మృతుని తండ్రి ముత్యాల రాజమల్లు ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రుద్రూరులో 10సెల్‌ఫోన్ల రికవరీ

కోటగిరి,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): రుద్రూరు పోలీస్ స్టేషన్‌లో ఫోన్ పొగొట్టుకున్న 10మంది బాధితులకు బుధవారం సెల్‌ఫోన్‌లను సీఐ కృష్ణ అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 10ఫోన్‌లను రికవరీ చేసి సంబంధిత వ్యక్తులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాయన్న తదితరులున్నారు.

గ్రామీణ యువకుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయాలి



గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువకుల్లో దాగిఉన్న క్రీడ నైపుణ్యాలను వెలికితీయడానికి క్రీడపోటీలు ఎంతో దోహదపడతాయని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రీమియర్ లీగ్ సీజన్-2 టోర్నమెంట్ ముగింపులో ఆయన పాల్గొన్నారు. పెగడాపల్లి, పెంటాకలాన్ టీమ్‌లు హోరాహోరీగా తలపడగా పెంటాకలాన్ క్రికెట్ టీమ్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా గెలిచిన విజేతలకు విన్నర్ ట్రోఫిని అందజేశారు. గెలుపొందిన విజేతలకు రూ.25,555నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, వీడీసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, నిర్వాహకులు మోహన్, గణేష్, రాజు, నరేష్, మనోజ్, భరత్‌లతో గ్రామ పెద్దలు పోతారెడ్డి, సుదర్శన్, కృష్ణారెడ్డి, నాగారెడ్డి, సాయిలు, నాగరాజు, లింగారెడ్డి, శంకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్: బోధన్ మాజీ మున్సిపల్ చైన్‌పర్సన్ సునీతా దేశాయ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుటుంబాన్ని బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల వారి పెద్ద కుమారుడు ప్రీతమ్ దేశాయ్ గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రీతమ్ దేశాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రీతమ్ దేశాయ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట టీపీసీసీ అధ్యక్షులు గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మార్కెటింగ్ చైర్మన్ నగేష్ రెడ్డి, గడుగు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

బోధన్ కోర్టు ఆవరణలో ఆకతాయి వీరంగం



ఆకతాయిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

బోధన్‌రూరల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో బుధవారం బీటీ నగర్‌కు చెందిన ఓ యువకుడు మద్యం సేవించి మద్యం మత్తులో కోర్టు ప్రాంగణంలో వీరంగం సృష్టించాడు. మద్యం సేవించి ఉన్న యువకుడు కోర్టులోకి ప్రవేశించి అక్కడే ఉన్న కోర్టు సిబ్బంది, కక్షిదారులతో వాగ్వివాదానికి దిగాడు. దీంతో సమాచారం అందుకున్న పట్టణ సీఐ వెంకట నారాయణ కోర్టుకు చేరుకుని ఆకతాయిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం మత్తులో న్యాయవాదులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుబ్బాక ఎమ్మెల్యేపై బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న వెంకటేష్‌గౌడ్

ముప్కాల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలని చేసిన వ్యాఖ్యాలపై ఆయనపై బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గన్నాల వెంకటేష్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని అరెస్టు చేసి విచారణ జరుపాలని ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీజ్ చేసిన ఇసుక డంపులకు నేడు వేలం

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): బడాభీమ్‌గల్ గ్రామంలో అక్రమంగా ఇసుకను డంపు చేశారని, వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు ఈ నెల 12న 84 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. ఆ సీజ్ చేసిన ఇసుకను గురువారం నాడు ఉదయం 12 గంటలకు బహిరంగాంగా వేలం పాటు నిర్వహించడం జరుగుతుందని తహసీల్ధార్ మహ్మద షబ్బీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ముందుగా రూ.పదివేల తహసీల్ధార్ కార్యాలయంలో డిపాజిట్ చేయాలని ఎవరూ ఎక్కువ వేంపాడితే వారికే ఇసుకను స్వాధీనం చేస్తామని, ఒకవేల వేలం దక్కని వారికి డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగి ఇవ్వడం జగుతుందని తహసీల్ధార్ తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై సొసైటీ అధికారుల నిర్లక్ష్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): బోధన్ సొసైటీ పరిధిలో వరి ధాన్యం కొనుగోలులో సొసైటీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ బోధన్ డివిజన్ కార్యదర్శి పుట్ట వరదయ్య అన్నారు. బుధవారం బోధన్ తహసీల్దార్ విఠల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బండారి గంగాధర్, లక్ష్మణ్ తదితరులున్నారు.

గ్రామపాలన, రికార్డుల నిర్వహణపై శిక్షణ

బోధన్‌రూరల్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ సమావేశపు మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పాలన, రికార్డుల నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధన్ డీఎల్‌పీవో నాగరాజు, డీపీఎం నరహరిలు పంచాయతీ కార్యదర్శులకు గ్రామపాలన,రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను వెంటవెంట పరిష్కరించేలా చూడాలన్నారు. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, గ్రామాలలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు నిత్యావసర సౌకర్యాలను తప్పకుండా అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ ఎంపీవో, ఎంపీడీవో, ఎంపీవో మధుకర్, ఎంపీడీవో బాల గంగాధర్‌లతో పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

మెండోర,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాల యాల సంస్థ టీఆర్ఈఎల్ఎస్ ఆధ్వర్యంలో పోచంపాడ్ బాలికల గురుకుల జూనియర్ కాలేజీలలో 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థినిలు ధరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసి మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందుటకు ఈ నెల 24వ తేదీ వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని, వచ్చే నెల 10 వ తేదీన నిజామాబాద్ పట్టణంలోని ప్రవేశ పరీక్ష జరిగిందనీ తెలిపారు. ప్రవేశ పరీక్షలలో ప్రతిభ, రిజర్వేషన్ ద్వారా ఎంపిక జరుగుతుందని తెలిపారు.


తాటి ముంజలు విక్రయిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) తాటిముంజలు

తాటి ముంజలతో ఆరోగ్యమస్తు!

● వేసవి తాపానికి ఉపశమనం ● మార్కెట్‌లో జోరుగా విక్రయాలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే తాటి ముంజ లు గుర్తొస్తాయి. ప్రకృతి సిద్ధమైన నీరు పోషకాలు కలిగిన తాటిముంజలు శరీరానికి ఎంతో చలువ చేస్తాయి. వేసవిలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఎలాంటి కల్తీ లేకుండా పోషకాలు అందించే తాటి ముంజలను కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో, బొగ్గు గుడిసె ప్రాంతంలో పెద్ద బజార్‌లలో చెల్ల కింద అమ్మకాలు జరుపుతున్నారు. వీటి ధర రూ.100కు డజన్‌గా విక్రయిస్తున్నారు.

● ఆరోగ్యానికి ఎంతో మేలు..

తాటి ముంజలు వేసవిలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. తాటి ముంజలు తక్కువ శరీరానికి కావాల్సిన శక్తిని ఇస్తాయి. వేసవిలో ముఖం మీద ఏర్పడే చిన్న చిన్న మొటిమలను నివారిస్తాయి. లేత కొబ్బరిని పోలి ఉండే ముంజల్లో మినరల్స్ చక్కెర సమతుల్యంగా ఉంటాయి. ఇందులో విటమిన్, ఐరన్, కాల్షియం లభిస్తాయి. తాటిముంజలు జీర్ణ వ్యవస్థను చురుగ్గా పని చేస్తాయి. ఎసిడిటి వంటి సమస్యలను అధిగమించవచ్చు. శరీరానికి కావాల్సిన ఏబీసీ విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం వంటివి పుష్కలంగా ఉంటాయి. వీటిలో అధిక మొత్తంలో నీరు ఉండటంతో శరీర బరువు తగ్గుతుంది. కాలేయం సంబంధిత వ్యాధులు తగ్గించడంతో పాటు శరీరంలో విష పదార్థాలు నిల్వ ఉండకుండా చేస్తాయి. వేసవిలో వాంతుల నుంచి ఉపశమనం కలుగుతుంది. అంతే కాకుండా క్యాన్సర్ కణాలను సైతం నిర్వహిస్తుంది. ట్యూమర్ టెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేసే సైటు కెమికల్స్ అంతో సైనిక్ వంటి వాటిని నిర్మూలించడానికి తాటి ముంజలు ఉపయోగపడుతాయని వైద్యులు చెబుతున్నారు.

● తాటి ముంజల్లో ఎన్నో పోషకాలు



వేసవిలో దొరికే తాటి ముంజల్లో ఎన్నో పోషకాలు లభిస్తాయని, శరారానికి కావాల్సిన విటమిన్లు ఉంటాయి. చాలా మంది ముంజలపై ఉన్న పై పొరలు తీసి తింటారు. కానిపై పొర తీయకుండా తినాలి. పై పొరలలో పోషకాలు ఉంటాయి. శరీరానికి చలువ చేస్తుంది.

-డాక్టర్ రవీంద్ర మోహన్, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఎల్లారెడ్డి


నర్సరీలలో మొక్కల రక్షణకు గ్రీన్ పట్టా ఏర్పాటు


పెరుగుతున్న మొక్కల్లో కలుపు తీస్తున్న కూలీలు

పచ్చదనానికి ప్రణాళిక సిద్ధం

● హరితహారానికి మొక్కలు సన్నద్ధం
● మద్నూర్ మండలంలో 1.34 మొక్కల లక్ష్యం

మద్నూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న అడవులకు ఊపిరి పోయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు హరితహారం తోడ్పడనుంది. త్వరలో నిర్వహించనున్న 11వ విడత హరితహారం విజయవంతం చేయడానికి అధికారులు మొక్కలు సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటడంతో అంతరించిపోతున్న అడవులకు ఊపిరి పోయడమే కాకుండా, వర్షాలు సమృద్ధిగా కురవడానికి, వాతావరణంలో కాలుష్య నివారణకు పచ్చదనం ఎంతో ముఖ్యమని ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. హరితహారం కోసం అవసరమైన మొక్కలు పెంచడానికి మట్టి, విత్తనాల సేకరణపై అధికారులు దృష్టి పెట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా హరితహారం కోసం ఉమ్మడి మద్నూర్ మండలంలో 34 గ్రామపంచాయతీలలో నర్సరీలను ఏర్పాటు చేసి వాటిలో మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీలలో 1.34 లక్షల మొక్కలు పెంపకం లక్ష్యంగా పెట్టుకొని ప్రణాళికలను సిద్ధం చేశామని సంబంధిత అధికారులు తెలిపారు.

● మూడు నుంచి ఐదు వేల మొక్కల పెంపకం లక్ష్యం

గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలలో మూడు నుంచి ఐదు వేల మొక్కలను పెంచడానికి అధికారులు లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం నర్సరీలలో బెడ్‌ల ఏర్పాటు, ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి నర్సరీలకు విత్తనాలను ఆరు నెలల కిందటే సరఫరా చేశారు. పూల మొక్కలు, పండ్ల మొక్కలైన బొప్పాయి, జామా, నిమ్మ, సీతా ఫలం, మామిడి, నారింజ, నేరేడుతో పాటు వృక్ష సంబంధిత మొక్కలైన గుల్ మొహర, వేప,కానుగ, టెంటో ఫోరం, మునగ, టెకోమా పెంచుతున్నారు.

● పక్షుల నుంచి రక్షణకు

నర్సరీలలో పెంచుతున్న మొక్కలు ఎండ తీవ్రత నుంచి తట్టుకోవడానికి రోజుకు కనీసం మూడుసార్లు నీళ్లు అందిస్తున్నారు. అలాగే మొక్కలకు ఎండ తీవ్రత నుంచి రక్షణకు గ్రీన్ పట్టాను ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల ఎండ తీవ్రతరం అయితే తట్టుకోవడంతో పాటు, పక్షుల నుంచి కూడా రక్షణగా ఉంటుంది.

● మల్టీ లేయర్ పద్ధతిలో

నర్సరీలలో పెంచిన మొక్కలను హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, దేవాలయాల ఆవరణలో, కాలువ చెరువుల గట్లపై రోడ్డు వెంట మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నట్లు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే నర్సరీలలో పెంచిన మొక్కలను పల్లె ప్రకృతి వనాలకు సరఫరా చేస్తామని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీలలో మొక్కల పెంపకం ద్వారా కూలీలకు పనులు దొరుకుతున్నాయి. నర్సరీలలో పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.250 వరకు కూలి పొందుతున్నారు.

● మూడు నెలల్లో మొక్కలు సిద్ధం

గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మొక్కలను హరితహారానికి సిద్ధం చేస్తున్నారు. మూడు నెలల్లో వచ్చే జూన్ నాటికి 1.34 లక్షల మొక్కలు అందిస్తాం. నర్సరీల నిర్వహణ విషయంలో గ్రామ సర్పంచ్, కార్యదర్శుల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

- రాణి, ఎంపీడీవో



● ఇంటింటికీ మొక్కల పంపిణీ

వర్షాకాలం ఆరంభంలో మండలంలోని 34 గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మొక్కలను పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నాము. ప్రతి మొక్క ఎదిగేందుకు కవర్లలో మొక్కతో పాటు పెరుగుతున్న కలుపు తీయిస్తున్నాము. ప్రతీ ఇంటికి పండ్లు, పూల, మొక్కలు పంపిణీ చేస్తాం. ఎండకు ఎండకుండా నర్సరీ నిర్వాహకులతో నిత్యం నీరు పట్టిస్తున్నాము.

- పద్మ, ఏపీఎం



కామర్స్ విభాగంలో రంజితకు డాక్టరేట్ ప్రదానం


టీయూలో డాక్టరేట్ పట్టాను రిజిస్ట్రార్ నుంచి అందుకుంటున్న రంజిత

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం కామర్స్ విభాగంలో పరిశోధక విద్యార్థిని రంజితకు డాక్టరేట్ పట్టాను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి ప్రదానం చేశారు. పరిశోధక విద్యార్థి రంజిత కామర్స్ సీనియర్ ప్రొఫెసర్ యాదగిరి పర్యవేక్షణలో అకౌంటింగ్ పాలసీస్ అండ్ ప్రాక్టిసెస్ అనే అంశంపై పరిశోధన జరిపారు. ఈ సందర్భంగా మౌఖిక పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా మౌలానా అబ్దుల్ కలామ్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫరుద్దిన్ షైమద్ హాజరై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి, కామర్స్ డీన్ రాంబాబు, డాక్టర్ శ్రీనివాస్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ధర్నాలో పాల్గొన్న టీయూ అధ్యాపకులు


హైదరాబాద్‌లో ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న టీయూ అధ్యాపకులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా మా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు ఆందోళన చేశారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నాకు టీయూ అధ్యాపకులు హాజరై తమ సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల ప్రతినిధులు దత్తహరి, గంగాకిషన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు.. పెరుగుతున్న చోరీలు

● నిందితులను పట్టుకునేందుకు పోలీసులకు సవాల్‌గా మారిన వైనం
● సీసీ కెమెరాలు మరమ్మతులు చేయించాలని పట్టణ ప్రజల డిమాండ్

బాన్సువాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖ పరంగా బాన్సువాడ పట్టణంలో ఆయా గ్రామాల్లో వ్యాపారస్థుల, దాతల సహకారంతో పకడ్బందీగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మొదట్లో వీటి నిర్వహణ బాగానే చేశారు. కానీ సుమారు రెండేళ్లుగా బాన్సువాడ పట్టణంలో సీసీ కెమెరాల నిర్వహణ గాలికి వదిలేయడంతో అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలో దొంగతనాలు, వాహన చోరీల నిందితులు కేసులు చేదించడంలో కీలక పాత్ర పోషించే సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో అధికారులకు సవాల్‌గా మారింది. బాన్సువాడ పట్టణంలో గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన మహేష్‌గౌడ్ అప్పట్లో సీసీ కెమెరా ఆవశ్యకతను ప్రజలకు అవగాహన కల్పించి పట్టణ ప్రజలకు, వ్యాపారస్తుల దాతల సహకారంతో 115 పట్టణంలో పలు కాలనీల్లో ప్రధాన రహదారిలో సీసీ కెమెరాలను బిగించారు. సీసీ కెమె రా నిర్వ హణపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఫలితంగా 115 నిఘా నేత్రాలు అన్ని ప్రాంతాల్లో పనిచేశాయి. ఇదే తీరులో బాన్సువాడ పట్టణ సీఐగా ఉన్న మహేష్‌గౌడ్ హయాంలోని బాగానే ఉన్నాయి. అధికారుల వరుస బదిలీలతో పోలీసింగ్ సేవలతో పాటు కెమెరా లను పట్టించుకోని వారి కరువయ్యారు. ప్రస్తుతం పట్టణంలో మొత్తం మీద 115 కెమెరాలు కూడా సరిగా పనిచేయని దుస్థితి నెలకొంది. ఆయా గ్రామాల్లో దాతల సహాయంతో సీసీ కెమెరాల బిగించి గ్రామ పంచాయతీ అను సంధానం చేశారు. పలు గ్రామాల్లో, పట్టణాల్లో కెమెరాలు మూలన పడ్డాయి పర్యవేక్షించే వారు లేకుండా పోయారు. సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో బాన్సువాడ కేంద్రంగా రాత్రి వేళల్లోనూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం, ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్, మినీ ట్యాంక్ బండ్, తాడ్కోల్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, ఆయా ప్రధాన రోడ్డులో సీసీ కెమెరాల పనిచేయక పోవడంతో పట్టణ ప్రజలు పోలీస్ అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. 2023, 24లో బాన్సు వాడ సంగమేశ్వర కాలనీలో మూడు ఆటోలు చోరీ అయ్యాయి. ఇప్పటివరకు ఈ కేసును చేదించలేదు. పోలీస్ శాఖ అధికారులు రాత్రి పూట పెట్రోలింగ్ చేయక పోవడంతో పాటు, సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో వరుస చోరీలు జరుగుతున్నాయని ఆయా కాలనీలా ప్రజలు చెబు తున్నారు. పట్టణంలో ఏవైనా నేరాలు సంఘటనలు జరిగినప్పుడు పోలీసులు హడావుడి చేసి ప్రైవేట్ వ్యక్తుల, దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలపై ఆధారపడాల్సి వస్తుంది. పోలీస్ ఉన్నతా ధికారులు సీసీ కెమెరాల పనితీరుపై మరోసారి సమీక్ష చేసుకొని పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పట్టణ సీఐ మండల అశోక్ వివరణ కోరగా అధికారులతో చర్చించి సీసీ కెమెరా మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తామన్నారు.


బాన్సువాడ పట్టణంలో పనిచేయని సీసీ కెమెరాలు

ప్లాస్టిక్ వ్యర్థం.. చేస్తోంది అనర్థం!

● మురికి కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలు
● ప్లాస్టిక్ కవర్ల నిషేధం అంతంత మాత్రమే


ఎల్లారెడిలోని ఓ మురికి కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో మురికి కాలువల సమస్య ప్రజలను వేధిస్తోం ది. కొన్ని కాలనీలో మురికి కాలువలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త నిండిపోయి రోడ్ల మీద మురికి నీరు పేరుకుపోయింది. మురికి నీరు ఆగడం వల్ల పందుల పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అంతేకాకుండా దోమలు, కీటకాలతో పట్టణ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న మురికి కాలువల్లో ప్లాస్టిక్ పేరుకుపోయి రోజుల తరబడి ఉంటున్నాయి. దీనివల్ల మురుగు నీరు ప్రవాహం లేకపోవడంతో మున్సిపల్ పరిధిలోని కొన్ని కాలనీలలో మురికి నీళ్లు మురికి కాలువలలో నిలిచి ఉంటున్నాయి.

● ప్లాస్టిక్ కవర్లు నిషేధం అంతంత మాత్రమే..

40 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం కలిగిన కవర్లు భూమిలో కరిగిపోకుండా అలాగే ఉంటున్నాయి. ఈ ప్లాస్టిక్ కవర్లు మురికి కాలువలో పడటంతో మురికి నీరు కవర్లు అడ్డుగా వస్తున్నాయి. తద్వారా ప్రజలు అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్లాస్టిక్ కవర్లు నిషేధంలో సంబంధిత మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. నామ మాత్రపు తనిఖీ నిర్వహించి ఒకరిద్దరికి జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురికి కాలువలలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో ఆ ప్రాంతాల్లో మురికి కాలువలు అధ్వానంగా ఉన్నాయని, విలీనమైన గ్రామాలలో నిర్మించా లని ఎప్పటికప్పుడు శుభ్రంచేయాలని విలీనమైన ప్రాంతాల ప్రజలు కోరుతు న్నారు.

● మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ వివరణ

మున్సిపల్ కార్మికులతో మురికి కాలువలలో పేరుకుపోయిన వ్యర్థాలను పిచ్చి మొక్కలను తొలగిస్తున్నామని ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రం చేస్తూనే ఉన్నారని ఎక్కడైనా మురికి కాలువలో ఇబ్బందులు ఉంటే శుభ్రం చేయిస్తామని ఆయన అన్నారు.

నిద్రావస్థలో తూనికల శాఖ

● 'తూ'నికలపై నియంత్రణేదీ..!?
● యథేచ్ఛగా తూకంలో తేడా!


ఎడపల్లిలో వరి ధాన్యం తూకం వేస్తున్న దృశ్యం

ఎడపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం పంట పండించిన రైతు ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియలో భాగంగా జరుపుతున్న తూకాల్లో భారీగా వ్యత్యాసాలు వెలుగులోకి వస్తున్నాయి. వీటిపై నిమ్మకు నీరెత్తినట్లు ఆ శాఖ వ్యవహరిస్తున్న తీరు వినియోగదారుల, రైతుల పాలిట శాపంగా, వ్యాపారుల పాలిట కల్పతరువుగా చెప్పవచ్చు. కామారెడ్డి, మహారాష్ట్ర ప్రాం తాల్లో వ్యత్యాసాలతో తయారు అవుతున్న తూకం రాళ్ళు యంత్రాల సహ కారంతో ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసా....గుతూనే ఉంది. దీనిపై పకడ్బందీ నియంత్రణ లేకపోవడంతో పాటు పక్కాగా అమ్యామ్యాలు ప్రతి నెలా సదరు అధికారులకు అందుతున్నాయనే ఆరోపణలు లేకపోలేదు.

● అక్రమం వెలుగు చూసిందిలా

ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో గల రైతు కరుణాకర్ తాను పండించిన వరి ధాన్యాన్ని గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరా క్రాంతి పథకం వారి ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించాడు. కొనుగోలు కేంద్రం వారు తూకం వేసిన తరువాత ధాన్యం లోడుతో ఉన్న లారీని ఎడపల్లి మండల కేంద్రంలో గల తెలంగాణ ధర్మ కాంటాలో తూకం వేశారు. తూకం వేయగా నికర బరువు 35 టన్నుల 710 కిలోలు వచ్చింది. ఇది గమనించిన రైతు కొనుగోలు కేంద్రంలో వేసిన తూకానికి ధర్మ కాంటా తూకానికి తేడా ఉండడంతో అధికారులను నిల దీశాడు. అదే రోజు లోడుతో ఉన్న ఆ లారీని రైసుమిల్లులో గల ధర్మ కాంటాలో తూకం వేయగా 35టన్నుల 890 కిలోలు వచ్చింది. రెండు ధర్మా కాంటాలో తూకం వేయగా 180 కిలోల తేడా వచ్చింది. ఇందులో అసలు ఏదో నకిలీ ఏదో అంతుచిక్కడం లేదు. అసలు తూకం ఏదో తెలియక లారీలో దాన్యం తరలించిన రైతులు అయోమయ స్థితికి చేరారు.

● గత రెండేళ్ల క్రితం ఇదే తంతు

గత రెండేళ్ల క్రితం ఎడపల్లి మండలంలోని మంగల్ పాడ్ చౌరస్తాలో ఉన్న తూకం యంత్రం ఇదేమాదిరిగా దాన్యం బరువులో వ్యత్యాసాలు వెలుగు చూశాయి. ఈ విషయం చిలికి చిలికి గాలివానగా మారింది. రైతులు ఆందోళనకు దిగారు. తిరిగి అదేతంతు పునరావృతం కావడం గమనార్హం. అసలు ఈ వ్యత్యాసాల వెనుక ఉన్న మతలబు ఏమిటో వీటిని ఎలా నమ్మాలో అంతు చిక్కడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా జరిగితే రైతులు తూకం కేంద్రాల కారణంగా భారీగా నష్టం తప్పదు.

● ఫిర్యాదులు అందినా స్పందన కరువు

ఇలా తూకంలో వస్తున్న వ్యత్యాసాలపై నష్టపోతున్న రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సంబంధిత రెవెన్యూ, తూనికల కొలతల అధికారులకు చరవాణి ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని దీంతో తమ గోడు ఎవరికి చెప్పాలో ఏం చేయాలో అంతుచిక్కని స్థితిలో బాధిత రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఏది ఏమైనా దాన్యం తూకాలపై వస్తున్న వ్యత్యాసాలను అరికట్టాల్సిన బాధ్యత పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు వచ్చిన ఫిర్యాదులపై స్పందించి కఠిన చర్యలు తీసుకోకపోతే వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతుందని సదరు బాధిత రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

● తూకంలో తేడా ఉన్న యంత్రాపై నిఘా పెడతాం
మహ్మద్ సుజాత్ అలీ, తూనికల కొలతల జిల్లా అధికారి

ఎడపల్లి మండల కేంద్రంలోని తూకం యంత్రంలో వస్తున్న తేడాల గురించి తూనికలు కొలతల శాఖ జిల్లా అధికారి మొహమ్మద్ సుజాత్ అలీని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తూకంలో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని తూకంలో తేడా ఉన్న యంత్రాలపై నిఘా పెడతామని ఆయన తెలిపారు.


TELANGANA DHARMAKANTA
Plot No. 17-109/5, Near Petrol Pump, Main Road, YEDAPALLY, Nizamabad (Dist.), (T.S.). Ph : 98496 02005
FULLY ELECTRONIC & COMPUTERISED 80 TONNES WEIGH BRIDGE
SERIAL No. : 1686 VEHICLE No. : TS16UB 6677
GROSS 48310 Kg DATE : 06/04/2025 TIME : 15:31
TARE 12600 Kg DATE : 06/04/2025 TIME : 09:50
NETT 35710 Kg
250
Party's Signature Operator's Signature

ఎడపల్లిలో తెలంగాణ ధర్మకాంటాలో తూకం వేసిన రశీదు


SRI SAIBABA AGRO INDUSTRIES DHARAM KANTA
Near ARP CAMP, RENJAL VILLAGE & MANDAL, NIZAMABAD DIST. A.P.
CELL : 9959433474
TONNE FULLY ELECTRONIC & COMPUTERISED WEIGH BRIDGE
2979 3 TS16UB 6677
300
VEHICLE No. :
No. OF BAGS :
48550 06/04/2025 17:06
12660 Kg DATE: 07/04/2025 TIME : 13:38
35890 Kg DATE: TIME :
Kg
24 HOURS SERVICE

నిజామాబాద్ రైసుమిల్లులో తూకం వేసి రశీదు

మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ రవికిరణ్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లోని ఎల్లమ్మగుట్టలోగల మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన కీ హోల్ వ్యాసి కులర్ చికిత్సను చేసినట్లు ప్రముఖ వైద్యుడు రవికిరణ్ తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర శివారులోని కాలూర్‌కు చెందిన అంజయ్య, ఇందల్వాయి మండలం అన్సాన్‌పల్లికి చెందిన మల్లయ్యలు ఇద్దరు వివిధ తేదీలలో కాళ్లలో తీవ్రమైన నొప్పి, మానని పుండు మరియు కొద్దిదూరం కూడా నడవలేని పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చారని వీరిని పరీక్షించిన తర్వాత ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ పెరిఫెరల్ యాంజియోగ్రామ్ పరీక్ష ద్వారా కాళ్లకు సంబంధించిన రక్తనాళాలలో రక్తం గడ్డ కట్టినట్లు నిర్ధారించి స్టంట్ వేసి రక్తప్రసరనను సాధారణ స్థితికి తీసుకురావడం జరిగిందన్నారు. చికిత్స తర్వాత ఇప్పుడు ఇద్దరు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నడవగలుగుతున్నారని అన్నారు. ఇటువంటి చికిత్స ఎటువంటి సర్జరీ లేకుండా చిన్న రంధ్రం ద్వారా చేయడం జిల్లాలోనే మొట్టమొదటి సారి అన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో ఎలాంటి కుట్టు కోత లేకుండా ఈ సర్జరీని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇటువంటి వ్యాధులు సాధారణంగా దూమపానం చేయడం వల్ల రావచ్చని తెలిపారు. సెంటర్ హెడ్ స్వామి మాట్లాడుతూ ఇటువంటి అరుదైన సర్జరీలు నిజామాబాద్ మెడికవర్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని హైదరాబాద్ వెళ్లనవసరం లేకుండా తక్కువ ఖర్చులో ఇక్కడే చికిత్స పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ హెడ్ వినయ్‌కుమార్, డాక్టర్ యజ్ఞ పాల్గొన్నారు.

బదిలీలు చేపట్టాలని మంత్రి జూపల్లికి వినతి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్లకు బదిలీలు చేపట్టాలని ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్ల సంఘం నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు విన్నవించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి జూపల్లికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ఎక్సైజ్ శాఖలో బదిలీలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని బదిలీలు చేపట్టాలని కోరారు. పదోన్నతుల విషయంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొంది కానిస్టేబుల్‌గానే పదవీవిరమణ పొందుతున్నారని పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, హెడ్‌కానిస్టేబుల్ నారాయణరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ భోజన్న, ప్రెస్ సెక్రెటరీ ఉత్తమ్, జాయింట్ సెక్రెటరీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తాండ్ర అంజయ్య తల్లి ఇటీవలే మరణించడంతో అంజయ్య కుటుంబాన్ని బుధవారం రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. అంతేకాకుండా గొల్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ లింగంకు ఇటీవలే గుండెపోటు ఆపరేషన్ కావడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోవద్దని బాజిరెడ్డి గోవర్ధన్ బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ ప్రతినిధులు శక్కరికొండ కృష్ణ, నల్లవెల్లి సాయిలు, లక్ష్మీనర్సయ్య, పద్మారావు, సూదం నాయక్, గీత, బుచ్చమ్మ, తదితరులు ఉన్నారు.

కామర్స్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం కామర్స్ విభాగంలో పరిశోధక విద్యార్థిని రంజితకు డాక్టరేట్ పట్టాను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి ప్రదానం చేశారు. రంజిత కామర్స్ సీనియర్ ప్రొఫెసర్ యాదగిరి పర్యవేక్షణలో అకౌంటింగ్ పాలసీస్ అండ్ ప్రాక్టీసెస్ అనే అంశంపై పరిశోధన జరిపారు. ఈ సందర్భంగా మౌఖిక పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా మౌలానా అబ్దుల్ కలామ్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫరుద్దీన్ షైమద్ హాజరై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి, కామర్స్ డీన్ రాంబాబు, డాక్టర్ శ్రీనివాస్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం



రాజ్యాంగ విలువలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

సిరికొండ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని కాంగ్రెస్ సిరికొండ మండల ఇన్‌చార్జి డీసీసీ ఉపాధ్యక్షుడు శివకుమార్ అన్నారు. మండలంలో సర్పెల్లి తండా, కొండూర్, పెద్దవాల్గోట్, పోత్నూర్ గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శివకుమార్ పార్టీ జండాలను ఎగురవేశారు. కొండూర్‌లో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద విచ్ఛిన్నకారుల నుంచి రాజ్యంగాన్ని కాపాడుకుంటామని అన్నారు. పదకొండేళ్ల నరేంద్ర మోదీ పాలనలో దేశంలో కులం, మతం పేరుతో విచ్ఛిన్నకర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శులు గొల్ల ఎర్రన్న, వెల్మ భాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాకారం రవి, సిరికొండ పీఏసీఎస్ అధ్యక్షుడు చెల్లం గంగాధర్, కిసాన్‌ఖేత్ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, యువజన రూరల్ అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు

ఆలయాల్లో సంకష్ట చవితి పూజలు



నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సంకష్ట చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణపతి ఆలయాల్లో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల్లో కొలువుదీరిన గణనాథునికి వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో పంచామృత అభిషేకాలు నిర్వహించి గరిక పూజలు చేశారు. పలు ఆలయాల్లో గణపతి అథర్వన శీర్షంతో హోమం కార్యక్రమం జరిపారు. సాయంత్రం ఆలయాల్లో భక్తులు సంకష్ట సామూహిక పూజలో పాల్గొని చంద్రోయ దర్శనంతో ఉపవాస దీక్షను విరమించుకున్నారు. జిల్లా కేంద్రంలోని సార్వజనిక్ గణేష్ ఆలయంతో పాటు బోర్గాం(పి) లక్ష్మీగణపతి ఆలయం, పద్మనగర్‌లోని వరసిద్ధివినాయక ఆలయం, బ్రహ్మపురిలోని సిద్ధివినాయక ఆలయం, న్యూ హౌజింగ్ బోర్డులోని మహాగణపతి ఆలయం, ఎన్టీఆర్ చౌరస్తాలోగల శుభం కలోతి గణపతి ఆలయం, బొడ్డెమ్మ చెరువు వద్దగల గణపతి ఆలయాల్లో ఘనంగా సంకష్ట చవితి పూజలు సాగాయి. .

పాలిటెక్నిక్‌లో ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష కోసం ఉచిత శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. కవితా కాంప్లెక్స్‌లోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కుమార్, ఇందూర్ విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందిస్తూ ఎంతో మంది దేశభక్తులకు స్ఫూర్తిగా నిలిచిన విద్యార్థి సంఘం ఏబీవీపీ అన్నారు. విద్యార్థి సంఘాలు అంటే కేవలం ఆందోళన అనే సంస్కృతి నుంచి 1949లో ఏబీవీపీ ఆవిర్భావం నుంచి ఎన్నో సేవా కార్యక్రమంలో భాగస్వాములు అవుతుందన్నారు. పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష ఉచిత బోధన తరగతులతో పాటు ఉచితంగా మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. రెంజర్ల నరేష్ మాట్లాడుతూ 1982లో కేవలం రెండు కేంద్రాలలో ప్రారంభమైన ఈ ఉచిత బోధన తరగతులు నేడు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అనేక కేంద్రాలలో అందిస్తూ వేలాది మంది విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంలో ఏబీవీపీ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘటన మంత్రి రాజు సాగర్, ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్, జిల్లా వ్యవస్థ ప్రముఖ్ సురేందర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు వెంకటకృష్ణ, దుర్గాదాస్, సాయిరంజిత్, బాలకృష్ణ, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి చొరబడితే క్రిమినల్ కేసులు



డబుల్ బెడ్‌రూం ఇల్లుకు తాళం వేస్తున్న తహసీల్దార్ మాలతి

ధర్పల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి అక్రమంగా ప్రవేశిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ మాలతి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోగల డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆమె ఆర్ఐలు రాజేశ్వర్, రవి, రెవెన్యూ సిబ్బందితో కలిసి సీజ్ వేశారు. ఇటీవల డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వేసిన తాళాలను పగలగొట్టి కొందరు నిరుపేదలు ఆక్రమించే ప్రయత్నం చేశారు. దీంతో అధికారులు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఇకపై డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి అక్రమంగా చొరబడితే కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకు కొందరు అమాయకుల వద్ద డబ్బులు వసూలు చేసి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇస్తామంటూ మోసం చేస్తున్నారని వారిపట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డబ్బులను డిమాండ్ చేసిన వారిని తమ దృష్టికి తెస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలు, వాహన రిజిస్ట్రేషన్ రద్దు

● సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు నడపడానికి ఇస్తే జైలు, వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందని సీపీ సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇకనుంచి రోజూ జిల్లాలో మైనర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని తల్లిదండ్రులు కానీ ఇతరులు కానీ మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వరాదని ఆయన కోరారు. ఇదివరకు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే పోలీస్ వారే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి జరిమానాలు వేసేవారని మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు ఇకపై మైనర్లు వాహనం తీసుకొని రోడ్డుపై తిరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఇకనుంచి ఎవరైనా మైనర్ డ్రైవింగ్ చేస్తూ దొరికితే అట్టి మైనర్‌ను, తల్లిదండ్రులు లేదా వాహన యజమాని ఎవరైనా ఎంవీ యాక్ట్ 2019 అమైన్‌మెంట్ సెక్షన్ 199-ఏ ప్రకారం సంబంధిత కోర్టులో హాజరుపర్చడం జరుగుతుందన్నారు. వాహన యజమానికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, 25వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందని మైనర్లు పట్టుబడిన వారికి 25 సంవత్సరాలు నిండినంతవరకు డ్రైవింగ్ లైసెన్సుకు అర్హులు కారని పట్టుబడిన వాహనం రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కావున ఎవరూ కూడా మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఆయన కోరారు.

అంగన్‌వాడీలకు మే నెల వేసవి సెలవులు ప్రకటించాలి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడిలకు మే నెల వేసవి సెలవులు ప్రకటించాలని అంగన్‌వాడి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడిల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ నెలలోనే ఎండలు తీవ్రంగా ఉన్నాయని అంగన్‌వాడి కేంద్రాలకు పిల్లలు హాజరుకావడం వల్ల వారి ఆరోగ్యాలు దెబ్బతినే అవకాశం ఉన్నందున మే నెలలో అంగన్‌వాడి కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలు, విద్యాలయాలకు సెలవులు ప్రకటిస్తున్న నేపథ్యంలో అంగన్‌వాడిలకు కూడా సెలవులు ప్రకటించాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 24న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు అంగన్‌వాడిలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి స్వర్ణ, సునీత, లావణ్య, లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆటో డ్రైవర్లకు బుధవారం ట్రాఫిక్ ఏసీపీ టి.నారాయణ, సీఐ ప్రతాప్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఎవరూ కూడా వారి డ్రైవింగ్ సీట్ పక్కన అదనంగా సీటు పెట్టరాదని అందరూ విధిగా యూనిఫామ్ ధరించాలని సూచించారు. ఎక్కువ మంది ప్యాసింజర్‌లను ఎక్కించుకోరాదని, నెంబర్‌ప్లేట్ లేని ఆటోను నడపరాదన్నారు. ఆటోలకు సరైన ధృవీకరణ పత్రాలు అనగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ ఖచ్చితంగా కలిగి ఉండాలని తెలిపారు. ఆటోడ్రైవర్ ఆటోను నోపార్కింగ్ జోన్‌లో వదిలి వెళ్లరాదని, ప్యాసింజర్లను ఎక్కించుకునే, దింపే సమయంలో ఆటోను రోడ్డు మార్గంలో ఆపరాదని ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు.

పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులతో ఉపాధ్యాయులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్యనగర్‌లోగల ఫ్యూచర్‌లైన్ పాఠశాలలో ప్రీప్రైమరీ విద్యార్థులకు బుధవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యార్థుల స్థానంలో ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసుకొని ప్రైమరీ ఎడ్యుకేషన్‌లోకి అడుగు పెడుతున్న సందర్భంగా వారికి పట్టాలు అందజేసి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించామన్నారు. తమ పాఠశాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి సంపూర్ణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. విద్యార్థులు ప్రీప్రైమరీ నుంచి ప్రైమరీ దశలోకి అడుగు పెట్టడం మొదటి మెట్టుగా భావిస్తూ గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించామని వారికి ఈరోజు జీవితంలో గుర్తిండిపోయేలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ నూతన భవనం ప్రారంభం

ఇందల్వాయి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో ఇండియన్ బ్యాంక్ నూతన భవనాన్ని జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. పాత భవనం నుండి కొత్త భవనంలోకి బుధవారం నుండి ఇండియన్ బ్యాంక్ సేవలు అందుబాటులో ఉంటాయని ఇండి 'చన్ బ్యాంక్ పరిధిలోగల గ్రామప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ రాజ్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సుబ్బారావు, బ్రాంచ్ మేనేజర్ ప్రశాంత్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవమాన భారంతో మహిళ ఆత్మహత్య

ఎడపల్లి, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ళ అనిత(35) అనే మహిళతో బంధువులు అయిన సాయిలు, రజిత మంగళవారం రాత్రి అవమానపరిచే విధంగా గొడవపడడంతో మనస్థానం చెంది ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అనిత బంధువుల అయిన సాయిలు, రజిత అనే ఇద్దరు అనితతో గొడవపడి అవమానించారని, అవమానం భరించలేక తన చెల్లి ఆత్మహత్యకు పాల్పడిందని, ఆత్మహత్యకు కారణమయిన సాయిలు. రజితలపై చర్యలు తీసుకోవాలని మృతురాలి అన్న శివశంకర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరునుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష

ఎడపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి బోధన్ కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13వ తేదీన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో పరిమితికి మించి మద్యం తాగి వాహనం నడిపినందుకు అతనిని బోధన్ మెజిస్ట్రేట్ ముందు బుధవారం హాజరు పరుచగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

ఎడపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబం గ్రామానికి చెందిన జెల్లేవర్ నర్సింగ్(38) అనే వ్యక్తి ఆత్మమత్య చేసుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంబం గ్రామానికి గత 11 ఏళ్ళ క్రితం బతకడానికని వచ్చి గ్రామంలో ఓ ప్లాటు కొనుగోలు చేయడంతో ఆర్థికంగా ఇబ్బంది ఏర్పడిందని, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లోవారు మంగళవారం బంధువుల ఇంటికి పెళ్ళికి వెళ్లి బుదవారం వచ్చేసరికి ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయి ఉన్నాడని, అప్పుడప్పుడూ అర్థిక ఇబ్బందులు ఎక్కువ అయ్యాయని తనతో అనే వాడని మృతుడి భార్య తెలిపిందని, మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతన్నుట్లు ఎస్సై తెలిపారు.



మాధవిని అభినందిస్తున్న సీపీ సాయిచైతన్య

రైఫిల్ విభాగంలో రాణించిన మహిళా సిబ్బందిని అభినందించిన సీపీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 18వ ఆల్ ఇండియా పోలీస్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ 2024 జాతీయ స్థాయి పోటీలు గతనెల 24 నుంచి 29 వరకు మధ్యప్రదేశ్‌లో జరుగగా ఆ పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన జిల్లాకు చెందిన మహిళా పోలీస్ కానిస్టేబుల్ సీహెచ్ మాధవి పోటీలలో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా బుధవారం సీపీ సాయిచైతన్య మాధవిని అభినందించి ప్రశంసాపత్రాన్ని ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం పేరు నిలబెట్టడం ఎంతో సంతోషకరమని అదేవిధంగా భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించి ఎన్నో మెడల్స్ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి లోపల రేకుల షెడ్డు వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి వయస్సు 45-50 సంవత్సరాల మధ్య కలిగి ఉండి మృతి చెందాడని ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో తెలుపు మరియు సబ్బుకలర్ షర్ట్, బ్లూకలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్న వ్యక్తి ఆసుపత్రి రేకుల షెడ్డు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ గమనించి చికిత్స కొరకు ఆసుపత్రిలోకి తరలించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు వైద్యులు తెలిపారని ఆయన తెలిపారు. వ్యక్తి వాలకం బట్టి లేబర్ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నట్లు కనబడుతుందని అతన్ని జేబుల్లో పరిశీలించగా గవర్నమెంట్ ఆసుపత్రి ఓపీ చిట్టిలో రాజు, తండ్రి పేరు పర్వయ్యగా ఉందని కావున ఇతనికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో లేదా 8712659714 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

● మంత్రి జూపల్లి కృష్ణారావు



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

భీమ్‌గల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం భీమ్‌గల్ మండల కేంద్రంలో బాల్కొండ నియోజక పరిధిలోని కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ దైనందిన జీవనశైలిలో మార్పులు చేసుకోవాని యోగ, వ్యాయమానికి కొంత సమయం కేటాయించుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. తమ పిల్లలను నిష్ణాతులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన బోధన అందిస్తున్న ప్రభుత్వ బడులలోనే చదివించి డబ్బులు ఆదా చేసు కోవాలని అన్నారు. అలాగే బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మున్సి పాలిటీలో గత ప్రభుత్వ హయంలో రూ. 35 కొట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి 80 శాతం పనులు పూర్తి చేసుకున్నాయని దీనిని వెంటనే పూర్తి చేయాలని అన్నారు. దీంతో పాటు సమీకృత మార్కెట్‌ను ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.280	రూ. 310



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.94,200	రూ.86,950	రూ.1010

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : గుడ్ బ్యాడ్ అగ్లీ (10.30, 1.25, 7.05, 10.00)
: మ్యాడ్ స్క్వేర్ (4.20)
స్క్రీన్-2 : ఓదెల-2 (10.00, 1.05, 4.10, 7.15, 10.20)
స్క్రీన్-3 : జాక్ (10.45, 4.50, 7.45, 10.40)
: జాట్ (హిందీ) (1.40)
స్క్రీన్-4 : జాట్ (హిందీ) (10.05, 7.25, 10.35)
: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (1.15, 4.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఓదెల-2 (10.40, 1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-2 : జాక్ (10.45, 1.30, 4.20, 7.20, 10.20)
స్క్రీన్-3 : జాట్ (హిందీ) (1.40, 7.30)
: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (4.30)
: గుడ్ బ్యాడ్ అగ్లీ ((10.30)

లలితామహాల్ : జాక్ (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : గుడ్ బ్యాడ్ అగ్లీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాట్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఓదెల-2 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్